# చిన్నబాబు

శ్రీరంగం శ్రీనివాసరావుగారు బి.ఏ. (కవితాసమితి)

౧

శిశిరాగమవేళ అది. మాఘమాసము. లోకానికి మంచు తెరలుకట్టుచున్నది. హేమంతనిశీథములే పరిపక్వముచెంది పవళ్ళనుకోరికి బహుదీర్ఘములగుచున్నవి. వత్సరానికావహించిన వార్ధక్యము శీర్ణపర్ణపుంజీభూతములైన చెట్టుచేమలోనను స్పష్టవిస్పష్టమగుచున్నది. పువ్వులతోపాటు ప్రకృతికి నవ్వులునులేవు. అట్టి అకాలమున ఆకసమాక్రమించినవి మేఘమాలికలు. తదీయవిజయభేరి నదించిన దురుములమిషమున. మరు నిమిషమున జగతిని ముంచెత్తినది కుంభద్రోణముగా కురిసినవాన. శీతకాలవర్షార్భటి చిత్రాతిచిత్రము. ప్రకృతి కది రుజాప్రపీడనమును పోలినది. తదాహతులలో దైన్యమొక్కటే ధ్వనించుచుండును. ఆప్రకృతిదైన్యమే ప్రాణముగొన్నవిధాన ఒకకుక్కపిల్ల చలిలో గజగజవడకుచు మంద్రరవళి నాక్రందించినది. ఆచలిలో, వానలో-ఆదరిద్రదీనను ఆదరించువారున్నారాఅని ప్రకృతిమాత ప్రశ్నించినది. అంతకుముందే అది అరచిన ఆక్రోశ మొకపసిఎడందలో ప్రతిధ్వనించియుండెను. ప్రకృత్యాదేశమును పరిపాలించుటకట్లుగా, అట్లుగా కుక్కపిల్లను చేరినాడు చిన్నబాబు. ఆబాలుని అమృతశీతలలోచనాంతములయందు ఘృణాప్రపూతనిధులే కలవు. నవనీతప్రసన్నమగు అతని లేతగుండెలో వత్సలతారసాపగలేగలవు. పదిలముగ కుక్కపిల్లనెత్తికొని చిన్నబాబు లోనికి తీసికొనివెళ్ళినాడు. పాలుత్రాగించి సేదదేర్చినాడు. దానిలో కళాకాంతులు స్ఫీతములైన క్షణమ బాలునిలో నుద్బుధహృదయశాంతియు నెలకొన్నది. బాలుడు కుక్కపిల్ల కన్నులలోనికిచూచినాడు. కుక్కపిల్ల బాలుని కన్నులలోనికి చూచినది. అర్థమెరుగరాని వాదృక్పాతములు. బాలునికన్నులలో కృతజ్ఞత అన్వయించినచో తదీయమిథోబంధనమున వారియందు స్నేహబాంధవ్యము జనించెనని చెప్పవచ్చును. ఆస్నేహమును ఆమోదించిన ప్రకృతికూడ హిమశీతలాశ్రువులతో ద్రవించినది.

౨

చావడిలో కుర్చీమీదకూరుచున్న అన్ననుచూచి చిన్నబాబు "అన్నయ్యా! పెంచుకోవడంఅంటే ఏమిటీ?" అని ప్రశ్నవేసినాడు. చదువుచున్నపుటమీది దృష్టులను తమ్మునిమీదికిత్రిప్పి ఒకసంభాషణకు సిద్ధముపడినట్లుగా అతడు "నువ్వు మమ్మల్ని వదలిపెట్టడం, వాళ్ళయింట్లోనే ఉండిపోవడం" అన్నాడు.

"వాళ్ళయింట్లో నన్నెందుకుండనిస్తారూ?" అని మరల బాలునిప్రశ్న. ఇంతలో ఇంటిలోనుండి కుక్కపిల్ల కుర్రవానికాళ్ళదగ్గరకువచ్చి ముడుచుకు కూర్చున్నది. సంభాషణ ఏకాగ్రతతో వినుచున్నట్లు కనిపించుచున్నది.

"ఎందుకుండనిస్తారా? నిన్ను పెంచుకుంటారుకాదూ మరి?"

"ఐతేను నేనిక్కడికి మళ్ళీరాకూడదూ?"

"నువ్విక్కడికిరావు. మేమే అప్పుడప్పుడువచ్చి నిన్ను చూస్తూంటాము."

"మరి నేనక్కడ ఉండిపోవాలికదా, నాతో మీరెవరూరారుకదా. పోనీ నాకుక్కపిల్లని తీసుకు పోవచ్చునా?"

"..............................."

"పాపం, అదేమిచేసింది? నాతో నేఉంటుంది; నేనంటే దానికెంతోఇష్టం."

"వాళ్ళది ఆచారమైనకుటుంబంకదా. కుక్కపిల్ల వక్కడ నిలవనిస్తారూ?"

"అన్నయ్యా! ఆచారంఅంటే ఏమిటీ?"

“మడికట్టుకొని ఉండడం, మడికట్టుకొని భోజనం చేయడం.”

“పోనీ కుక్క కూడా మడిగా నేనుంటే?”

ఆగని అన్నవవ్వే దీనికి జవాబు.

అన్న మాట్లాడక పోవుట చూచి చిన్నబాబు “అన్నయ్యా! పాపం కుక్కపిల్ల నాతో ఉంటే నేమి? అదంటే నాకూ ఇష్టమే” అన్నాడు.

“నీకక్కడ ఉపనయనం కాబోతున్నది. అప్పుడు పక్కన కుక్కపిల్లని కూచోపెట్టుకుంటారా ఎవరేనా?”

“ఉపనైనమా? అంటే?”

“ఒడుగన్న మాట. నువ్వు బ్రాహ్మడివౌతావు. బ్రాహ్మలు కుక్కల్ని ముట్టుకోరు.”

“ఇప్పుడు నేను బ్రాహ్మణ్ణి కానూ. ఇప్పుడు నేను కుక్కని ముట్టుకోలేదూ? నాయనమ్మ నన్ను పెద్ద బ్రాహ్మడివంటుందే!”

“మనింట్లో మనకి తప్పలేదు. మనింట్లో అయినా ఒడుగునాడు కుక్కని ముట్టుకుంటారా?”

“పోనీ తర్వాతో?”

“తర్వాతమాట చూసుకోవచ్చు. ఇప్పుడుమాత్రం అక్కడికి కుక్కపిల్లని పట్టికెళ్ళకూడదు.”

“ఒడుగవుతుందనేనా? పోనీ ఆతర్వాత నాకుక్కపిల్లని తెచ్చిపెట్టవూ అన్నయ్యా?”

“అలాగే తెస్తానుకాని, అసలు అక్కడ ఉండడం నీకు ఇష్టమేనా? అపల్లెటూరిలో నీకు కాఫీ ఉండదులే.”

“మరేమిటి ఉంటుంది?”

“చద్దిఅన్నం, ఆవునెయ్యీ, గేదెపెరుగూ.”

“అయితేనేం? నాయనమ్మ ఇవే మంచివంటుందివంటికి.”

“అయితే నువ్వక్కడికి వెళతావన్నమాటే. అక్కడ నీకు ఆడుకుందికెవరూ ఉండరులే.”

“నాకు కుక్కపిల్లవుంటే అదేచాలు.”

## 3

ఆపల్లెటూరి అగ్రహారమున ఆచారమగు కుటుంబములే కలవు. అన్నియు చూచినంతనే బ్రాహ్మణ గృహములుగా పరిచయములు కాగలవు. ఒకఇంటిలో ఇప్పుడు చిన్నబాబు దత్తపుత్రుడు.

అతని ఉపనయనము జరిగినది. వటూత్తముడతడు. ద్విజుడు.

పండుగసందడి తగ్గుచున్నది. ఉపనయనానంతరము బంధువులందరు బయలుదేరి పోవుచున్నారు. అప్పుడు మెల్లగా చిన్నబాబు అన్నను సమీపించినాడు.

“అన్నయ్యా! కుక్కపిల్లని తెచ్చిపెట్టవూమరి?”

ఎట్లు గడపినాడో ఈరోజులు. ఇప్పుడు మరల ఒక్కమారుగా కెరటమై పొంగినది కోరిక. కుక్కపిల్లను తీసికొనిరాక తీరదన్నాడు.

అన్న సమ్మతిచెప్పిపోగా చిన్నబాబు తృప్తితో మరలినాడు. అప్పటినుండి నిరీక్షణమే అనుక్షణమా బాలుడు.

ఆకసమాక్రమించినవి మేఘమాలికలు. లోకమును ముంచినది వర్షధార. ప్రకృతి నొక్కట ప్రబలముగ ఊగించినది చలి. జగతికి కారుక్రమ్మినచీకటి కప్పికొనుటకు కంబళివినది.

చిన్నబాబు వ్యాధిపీడితుడైనాడు. మంచాని కంటుకొనిపోయినాడు. నిరీక్షఫలించక, నిరాశచే నిస్పృహకలిగి వాని మనస్సువాడి మోడైనది. అన్న ఎప్పటికిరాకపోవుటచే బాధ మరియు ప్రబలమైనది. కాని అన్న రాకుండుటకు కారణమేమో? ఆతనికి తమ్మునిఆత్రము పూర్తిగా తెలియును. అయినను రాలేదు. ఎట్లురాగలడు? ఇంటిలో కుక్కపిల్ల లేదు. అందరును ఊరికివచ్చినప్పుడు ఆకుక్కపిల్ల ఒంటరిది, ఎక్కడకు పోయినదో ఎవ్వరికిని తెలియదు. అన్న ఎట్లురాగలడు? కుక్కపిల్లలేకుండ వచ్చుటన్నది ఎందులకు? అన్న కుక్కపిల్లను ఉట్టుకొన్నాడు. పారిపోయినదా విశ్వాసము తెలియక?

*   *   *   *

తీవ్రముగా గాలి. శ్రోణీపాతముగా వాన. కొరికితినునట్లుగా చలి. జంగమములు కదలవు. స్థావరము లెగిరిపోవుచున్నవి. చిన్నబాబు నిద్రాలుడు. చిన్నబాబు శోషిల్లిపోవుచున్నాడు.

*   *   *   *

గుమ్మములో, మడికట్టుకొని చలికి కప్పుకొని కూరుచున్నదొక స్త్రీ. కుంపటిఒకటికూడ కలదచ్చట. అప్పటికిని చలి ఆగుటలేదు. ఆబాధ బోధపడుచునే ఉన్నదామెకు.

*   *   *   *

చిట్టచీకటిని చీల్చి మెరసిన దొకవిద్యుల్లత. ఒక్కమారు డీకొని కాలాంబుదములు గట్టిగ గర్జించినవి. ప్రకృతి కొక్కమారు భయావేశము కల్గినది.

*   *   *   *

గుమ్మములోనిఆమె కూర్చుండియేఉన్నది. చలిచే మూల్గుచుండక పోవనులేదు. కుంపటిమీద చేతులు వెచ్చచేసికొనుచు నేఉన్నది.

అప్పు డతిదీనముగా, సన్నగొంతుతో జాలిజాలిగా ముర్మురించుచు ఒకకుక్కపిల్ల చేరవచ్చినది. తల నిండనిండిన దానికండ్లలో ఆయాసము, ఆశ స్పష్టముగాఉన్నవి. ఒడలంతయు తడిసిపోయి, కడుతీవ్రపు చలిచే గడగడవడకుచున్న దాకుక్కపిల్ల.

ఆమెమాత్రము "మడిచెడగొట్టినావే రాక్షసిముండా!" అని దయాశూన్యముగా కుక్కపిల్లను దూరముగా విసరికొట్టినది.

చిన్నబాబు వేయిచెవులతో వినుచున్నాడు. అంత జ్వరములోకూడ గుమ్మములోనికి వచ్చినాడు. "ఏదీ కుక్కపిల్ల?" అని అరచినాడు. వీథిలో మహాకరుణమైనఅరుపు వినిపించినది. ఏమో అరిగించికొన్నట్లు రుంయిమని గాలి అప్పుడు రొదచేసినది.

"వానరా, తడుస్తావు ఆగు, ఆగు!" అనుమాటలు చిన్నబాబు వీథిలోనికి వెళ్ళినంతలో విన్పించినవి. బాలుడు లక్ష్యపెట్టలేదు; పరుగెత్తిపోయి కుక్కపిల్ల నెత్తుకొన్నాడు.

ఆవానలో, గాలిలో, నిర్మానుష్యమగు ఆవీథిలో చిన్నబాబు, చేత కుక్కపిల్లయుమాత్రమే. కాని ఆశాబకమున జీవకళలేదు. తుది అరపుతో ప్రాణములిదివరకే ఎగిరిపోయినవి.

వేడికన్నీటితర్పణములతో చిన్నబాబు కుక్కపిల్లను దీనముగాచూచినాడు. అప్పుడే ఆకుర్రవాని నింటిలోని కెత్తుకొనిపోయి రెవ్వరో తొందరతొందరగా! ఉష్ణములోన ఉప్పొంగిపోవుచున్నది.

కుక్కపిల్లను వదలలేదు. వడకుచేతులతో హృదయమున కదుముకొన్నాడు. "ఇది నాకుక్కపిల్ల. నేనెరుగుదును. ఇదే, ఇదే! ఇదే కావాలి నాకు."



ఇవే ఆబాలునిమాటలు.